
నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, సోమవారం 12 మే 2025 | BHADRADRI KOTHAGUDEM



- ప్రతి ఏటా తునికాకు సేకరిస్తున్న కార్మికులు
- కష్టానికి తగిన ప్రతిఫలం లేక గిరిజనుల ఆవేదన
- ఓసీల పేరుతో అటవీభూమి కనుమరుగు
- అడవిలేక సరిహద్దు దాటివెళ్లాల్సి వస్తున్న వైనం
- రేటు పెరగదు.. లాభాల బోనస్ రానేరాదు
- భద్రాద్రి జిల్లాలో 32,600 స్టాండర్డ్ బస్తాల లక్ష్యం
- నేటి నుంచి ప్రారంభంకానున్న ఆకు సేకరణ

# మండే ఎండల్లో మైళ్ల దూరం నడిచి..

**భద్రాద్రి అడవుల్లో.. మండే ఎండల్లో.. మైళ్ల దూరం నడిచి.. తునికాకు కార్మికులు ఆకు సేకరణ చేసినా తగిన ప్రతిఫలం దక్కడం లేదు. చెట్టుచెట్టూ తిరిగి పుట్టపుట్టా వెతికి తునికాకులు సేకరిస్తున్న కార్మికుల కష్టం ఏటా ఎండల్లోనే ఆవిరైపోతున్నది. ఒకవైపు అడవి జంతువులు, మరోవైపు లభ్యంకాని ఆకులు, ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు గిరిజనులను వెంటాడుతున్నాయి. అయినప్పటికీ గిరిజనులు వేసవిలో దీనినొక ఉపాధి మార్గంగా ఎంచుకొని తునికాకు సేకరిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం 50 ఆకుల కట్టకు ఎప్పటిలాగానే రూ.3 ధర ఇవ్వడంతో తునికాకు సేకరించిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్ట రేటు పెంచాలని ఏటా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేసినా పైసా కూడా పెంచకపోవడం గమనార్హం. శ్రమకు తగ్గ గుర్తింపు ఇవ్వకపోగా సకాలంలో ప్రభుత్వం ఆకు సేకరణ జరపకపోవడంతో మన్యం ప్రాంతాల్లో పనుల్లేక గిరిజనులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. – భద్రాద్రి కొత్తగూడెం, మే 11 (నమస్తే తెలంగాణ)**



సేకరించిన తునికాకును కట్టలు కడుతున్న గిరిజన కుటుంబాలు (ఫైల్)

అడవిలో చాలాదూరం నడిచి వెళ్తే తప్ప ఆకులు దొరికే పరిస్థితి లేకపోవడంతో తమ వేసవి పంట రానురానూ అంతరించిపోతున్నదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు ఆకు సేకరణకు రావాల్సిన బోనస్ కూడా రాకపోవడంతో గిరిజనులు ఆసక్తి చూపడం లేదు. గిరిజన సంఘాలు, రాజకీయ నాయకులు ధర్నాలు చేసినా ఫలితం లేకుండాపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రేటు పెరగదు.. బోనస్ రాదు..

మైళ్లదూరం వెళ్లి ఆకు సేకరణ చేస్తే కనీసం కూలీమందం కూడా సొమ్ములు వచ్చే పరిస్థితి లేకపోవడంతో తునికాకు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుడు 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 ఇచ్చారు. గతంలో కూడా అదే పరిస్థితి. ఈ ఏడాది ధర పెంచాలని డిమాండ్ చేసినా అటవీశాఖ నుంచి ఎలాంటి స్పందనా లేదు. దీంతోపాటు కార్మికుల బోనస్ కూడా మూడేళ్లుగా రావడం లేదు. దీంతో తమ కష్టానికి ఫలితం దక్కడం లేదంటూ వారు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 25 వేల మంది తునికాకు కార్మికులు ఏటా తునికాకు సేకరిస్తున్నారు. వీరందరికీ ఏటా ఆకు సేకరణ అమ్మకాల ద్వారా వచ్చే లాభాల్లో రూ.12 కోట్ల వరకూ బోనస్ రావాల్సి ఉంటుంది. 2022 వరకు కార్మికులకు బోనస్ ఇచ్చారు కానీ అప్పటి నుంచి కొత్త సర్కారు ఆ మాట ఎత్తడం లేదు.

### అటవీభూమి కనుమరుగు

జిల్లాలో రోజురోజుకూ అడవి అంతరిస్తోంది. సింగరేణి ఉపరితల గనులు విస్తరిస్తుండడం, ప్రభుత్వ భూములను ఇతర అవసరాలకు వినియోగిస్తుండడం వంటివి కూడా ఇందుకు కారణమవుతోంది. దీనికితోడు పోడు భూమి కూడా ప్రధాన అవరోధంగా ఉంది. వీటి ఫలితంగా అటవీ సంపద కనమరుగవుతున్నది. దుమ్ముగూడెం ప్రాంతంలో అడవి తగ్గిపోవడంతో అక్కడి గిరిజనులు తునికాకు కోసం రాష్ట్ర సరిహద్దు దాటాల్సి వస్తున్నది. మైళ్ల దూరం వెళ్లినా కార్మికులకు ఫలితం దక్కడం లేదు. దీంతో తునికాకు కార్మికులు ఆకు సేకరణపై ఆసక్తి చూపకపోగా అధికారులు సైతం ప్రూనింగ్ పనులు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. తునికాకు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.

### 32,600 స్టాండర్డ్ బస్తాల లక్ష్యం

జిల్లాలో ఆరు ఫారెస్టు డివిజన్ల ద్వారా 39 యూనిట్లలో తునికాకు సేకరణ చేయనున్నారు. మణుగూరు డివిజన్‌లో 5 యూనిట్లలో 5,400 బస్తాలు, పాల్వంచ డివిజన్‌లో 4 యూనిట్లలో 2,300 బస్తాలు, ఇల్లెందులో 8 యూనిట్లలో 10,600 బస్తాలు, కిన్నెరసాని డివిజన్‌లో 5 యూనిట్లలో 3,200 స్టాండర్డ్ బస్తాలు, భద్రాచలం డివిజన్‌లో 5 యూనిట్లలో 9,700 బ్యాగులు, కొత్తగూడెం డివిజన్‌లో 2 యూనిట్లలో 1,400 బ్యాగులు సేకరించనున్నారు.

### ఆదివాసీలపై సర్కారు చిన్నచూపు



ఆదివాసీలు అడవిని నమ్ముకుని జీవిస్తున్నారు. ఎండల్లో కష్టం చేసేది వాళ్లు మాత్రమే. అలాంటి ఆదివాసీ బిడ్డల కష్టాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 50 ఆకుల కట్టకు రూ.3 ఇస్తున్నారు. ఇది పాత ధర. కొత్తగా కట్టకు రూ.5 ఇవ్వాలంటూ ఏటా ఆందోళనలు చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రూనింగ్ పనులు కూడా చేయడం లేదు. ఆదివాసీలపై చిన్నచూపు తగదు.

**– అమర్లపూడి రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐకేపీఎంఎస్**

### బోనస్ ఇవ్వలేదు.. ధర పెంచలేదు..



రెండేళ్లుగా తునికాకు బోనస్ రాలేదు. ఎండల్లో ఆకు సేకరణ చేస్తున్నాం. ధర కూడా పెంచడం లేదు. ఎండల్లో సేకరణ చేయడం చాలా కష్టమైన పని. అడవిలో జంతువులు ఉంటాయి. వాటిని చూసుకుంటూ తప్పించుకుని దాక్కుని మరీ వెళ్లాల్సి ఉంటుంది.

**– గొగ్గెల లక్ష్మీనారాయణ, తూరుబాక, గుండాల మండలం**

### నేటి నుంచి ఆకు సేకరణ



భద్రాచలం, ఇల్లెందు డివిజన్లలో సోమవారం నుంచి తునికాకు సేకరణ జరుగుతుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారమే కొనుగోలు జరుగుతుంది. బోనస్ డబ్బులు రావాల్సి ఉంది. రాగానే జమ చేస్తాం.

**– సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఎఫ్‌వో, ఖమ్మం**

## ఎప్‌సెట్‌లో ఖమ్మం జిల్లాకు.. బెస్ట్ ర్యాంకులు

- ఇంజినీరింగ్, అగ్రీలో 28, 61, 77, 102, 109, 110 ర్యాంకులు
- రాణించిన ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు



కుషాల్ (28వ ర్యాంకు) శ్రీచైతన్య



నిషాంత్ (61వ ర్యాంకు) శ్రీచైతన్య



సాయిచరణ్ (77వ ర్యాంకు) హార్వెస్ట్



సంహిత (102వ ర్యాంకు) న్యూవిజన్



ఆకాంక్ష (109వ ర్యాంకు) న్యూవిజన్



శీతల్ (110వ ర్యాంకు) న్యూవిజన్

ఖమ్మం అర్బన్, మే 11: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎప్‌సెట్–2025) ఫలితాల్లో ఖమ్మం జిల్లా విద్యార్థులు రాణించారు. రాష్ట్రస్థాయిలో ఇంజినీరింగ్‌లో 28, 61, 77, 102, 109, 110 ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని మరోసారి చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో అత్యుత్తమ ర్యాంకులతో మెరిశారు. ఫలితాలు ఏవైనా ర్యాంకులు తమవే అనేలా ఆదివారం విడుదలైన తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో విజయఢంకా మోగించారు. ఇంటర్, జేఈఈ ఫలితాల్లో సత్తా చాటినట్లే.. పోటీ పరీక్ష అయిన ఎప్‌సెట్‌లోనూ అత్యుత్తమంగా రాణించి జిల్లా విద్యా పరిమళాలను రాష్ట్రం నలుదిక్కులా వ్యాపింపచేశారు. తెలంగాణ ఏర్పాటు నుంచి జిల్లా విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన ఆన్‌లైన్ ఎప్‌సెట్‌లో ఖమ్మం జిల్లాలో ఇంజినీరింగ్ విభాగంలో 10,014 మంది, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్‌లో 4,824 మంది, భద్రాద్రి జిల్లాలో ఇంజినీరింగ్‌లో 778 మంది, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్‌లో 388 మంది పరీక్షలు రాశారు.

### 150లోపు ఆరు ర్యాంకులు..

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి ఎడ్యుకేషన్ హబ్‌గా హైదరాబాద్ తర్వాత ఖమ్మానికి పేరుంది. ఆ పేరును ఎప్పటికప్పుడు జిల్లా విద్యార్థులు నిలుపుతూనే వస్తున్నారు. ఈసారి ఎప్‌సెట్ ఫలితాల్లో 150లోపు ఆరు ర్యాంకులు సాధించి అదరహో అనిపించారు. ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లాకు 50లోపు ర్యాంకు రాలేదు. ఎప్‌సెట్–25లో రెండెంకల లోపు ర్యాంకులతో ప్రైవేట్ కళాశాలలు సత్తా చాటాయి. అయితే, ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థుల్లో హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలల్లో చదివి 100లోపు ర్యాంకులు సాధించిన వారు కూడా ఉన్నారు. నేరుగా ఖమ్మంలోని కళాశాలల్లోనే చదివిన విద్యార్థులు 28, 61, 77, 102, 109, 110 వంటి ఉత్తమ ర్యాంకులను ఎప్‌సెట్–25లోనే నమోదు చేశారు. ఇంటర్ ఫలితాల్లో టాప్ మార్కులతో రాణించగా.. జేఈఈ ఫలితాల్లోనూ అదే స్థాయిను కొనసాగించింది. ఇప్పుడు విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లోనూ ఆశించిన ఫలితాలతో విజయభేరి మోగించిన విద్యార్థులు, విద్యాసంస్థల బాధ్యులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారు.

### ప్రైవేట్ కళాశాలల్లో..

ఎప్‌సెట్–25 ఫలితాల్లో ఖమ్మం జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు తమ హవాను కొనసాగించాయి. 28, 61 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులు వీ.కుషాల్, వీ.నిషాంత్ సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. ఇంజినీరింగ్‌లో 77, అగ్రికల్చర్/ఫార్మసీలో 120 ర్యాంకులకు హార్వెస్ట్ విద్యార్థులు బీ.సాయిచరణ్ రాణి ఉమా అలేఖ్య సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ తెలిపారు. ఇంజినీరింగ్‌లో 102, 109, 110 ర్యాంకులను న్యూవిజన్ విద్యార్థులు పీ.సంహిత, ఎం.ఆకాంక్ష, ఆర్.శీతల్ సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ వివరించారు.

## రేపటి నుంచి ఉపాధ్యాయులకు.. వృత్యంతర శిక్షణ

- ట్రైనింగ్‌పై పలు ఉపాధ్యాయ సంఘాల భిన్నాభిప్రాయాలు
- ఎండల దృష్ట్యా ఒక్కపూటే నిర్వహించాలంటూ వినతులు
- మూడు దశల్లో హార్వెస్ట్ పబ్లిక్ పాఠశాలలో శిక్షణ నిర్వహణ



రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందుతున్న డీఆర్పీలు (ఫైల్)

ఖమ్మం, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జిల్లాలోని ఉపాధ్యాయులకు ఈ నెల 13 నుంచి మూడు దశల్లో వృత్యంతర శిక్షణను ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని హార్వెస్ట్ పాఠశాలలో దీనిని ప్రారంభించనుంది. ఇందుకు అవసరమైన షెడ్యూల్‌ను కూడా రూపొందించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) సామినేని సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్పీలు, సెక్టోరియల్ అధికారులకు ఈ నెల 12న సంసిద్ధతా సమావేశం ఏర్పాటుచేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని డీఈవో స్పష్టం చేశారు.

మే 13 నుంచి 17 వరకు మొదటి దశ, మే 20 నుంచి 24 వరకు రెండో దశ, మే 27 నుంచి మే 31 వరకు మూడో దశ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఎస్‌ఏ (ఆంగ్లం) విభాగంలో 326 మంది, ఎస్‌ఏ (గణితం) విభాగంలో 453 మంది, ఎస్‌ఏ (సోషల్) విభాగంలో 436 మంది, ఎంఆర్‌పీలు 168 మంది, ప్రత్యేక విద్య విభాగంలో 62 మంది హాజరుకానున్నట్లు వివరించారు. కొత్తగా ఆన్‌లైన్‌లోనే జియోట్యాంగింగ్ ఆధారిత హాజరును ఉపాధ్యాయుల నుంచి తీసుకుంటున్నామని, ఐదు రోజుల శిక్షణ అనంతరం ఆన్‌లైన్‌లోనే హాజరు సర్టిఫికెట్ వస్తుందని డీఈవో సత్యనారాయణ పేర్కొన్నారు.

### ఉపాధ్యాయ సంఘాల భిన్నాభిప్రాయాలు..

నిండు వేసవిలో శిక్షణ ఏర్పాటు చేయడంతో పలు ఉపాధ్యాయ సంఘాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. శిక్షణకు హాజరయ్యే విధానంలో కొంతమేర మినహాయింపులు ఇవ్వాల్సిందేనని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే వేసవి దృష్ట్యా ఒక్కపూటే శిక్షణ పూర్తి చేయాలని డీఈవో సత్యనారాయణకు మరో సంఘం నాయకులు వినతిపత్రాలు అందించారు. మండు వేసవి కావడంతో శిక్షణకు పూర్తిస్థాయిలో హాజరు ఎలా ఉంటుందోనన్న అంశంపై విద్యాశాఖ అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. అయితే, గత విద్యాసంవత్సరమంతా విద్యాబోధన చేసిన తాము.. తమ ఆరోగ్య పరీక్షలు, చికిత్సల కోసం వైద్యుల వద్ద ఇప్పటికే అపాయింట్‌మెంట్లు తీసుకున్నామని కొందరు ఉపాధ్యాయలు అంటున్నారు. తాము సుదూర ప్రాంతాల్లో ఉన్నామని మరికొందరు ఉపాధ్యాయులు చెప్పారు. ఇలాంటి తరుణంలో తమకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని వారు కోరుతున్నారు. అయితే, ఇలాంటి కారణాల వల్ల మొదటి విడతలో హాజరుకాని ఉపాధ్యాయులకు రెండో దశలోగానీ, లేదంటే మూడో దశలగానీ శిక్షణకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### మాతృసంస్థకు అకడమిక్ మానిటరింగ్ అధికారి..

ఖమ్మం జిల్లా ఏఎంవోగా, సమగ్రశిక్షలో సెక్టోరియల్ అధికారిగా ఇన్నాళ్లూ పనిచేసిన రవికుమార్.. ఇకపై తాను సేవలందించలేనంటూ విద్యాశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే, జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలకు అతడు పీజీహెచ్‌ఎంగా వెళ్తున్నట్లు సమాచారం. దీనిపై రాష్ట్రస్థాయి అధికారులు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ కార్యక్రమానికి ముందే ఏఎంవోగా రవికుమార్ తన బాధ్యతలను విరమించుకోవడం గమనార్హం. ఏఎంవోగా మరో సెక్టోరియల్ అధికారికి అదనపు బాధ్యతలను అప్పగించనున్నట్లు సమాచారం. అయితే, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ఏర్పాటుచేయడం, మండు వేపవిలో శిక్షణ వద్దంటూ ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం చెబుతుండడం, ఇదే సమయంలో ఏఎంవో రిలీవ్ కావడం వంటి అంశాలు విద్యాశాఖకు పెను సవాలుగా మారుతున్నాయి.

## రేపు పాలిసెట్

- అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- ఏర్పాట్లు పూర్తిచేశాం: పరీక్షల సమన్వయ అధికారులు

ఖమ్మం అర్బన్/ రామవరం/ సింగరేణి/ భద్రాచలం, మే 11: పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్ష పాలిసెట్–2025ను ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ జాకీరుల్లా, కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ భద్రాద్రి జిల్లా కో ఆర్డినేటర్ బండి శ్రీనివాస్, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ డాక్టర్ జాన్‌మిల్టన్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఖమ్మం జిల్లాలోని ఐదు కేంద్రాల్లో మొత్తం 2,804 మంది, భద్రాద్రి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 3,352 మంది పరీక్ష రాయనున్నట్లు వివరించారు. అభ్యర్థులందరూ నిర్దేశిత సమయానికంటే రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు చెప్పారు. హాల్‌టికెట్లపై ఫొటోలు స్పష్టంగా లేని అభ్యర్థులు గెజిటెడ్ అధికారుల ద్వారా తమ ఫొటోలను ధ్రువీకరించుకోవాలని సూచించారు.

